కథ

# మార్చాల్సింది కాని...

"షెల్టర్ అంటే అర్థమేమి టమ్మా?"

"మాది ఇంగ్లీషు మీడియం, తాతయ్యా!"

"వాట్ డు యు మీన్ బై షెల్టర్?"

గుడ్లప్పగించి చూచింది ప్రియాంక... విష్ణుమూర్తిగారి అయిదేళ్ల మనుమరాలు. ప్రైవేటు స్కూల్లో మొదటి తరగతి చదువుతున్నది.





ప్రశ్న కఠినంగా ఉందేమోనని అనుమానంతో మాటలు మార్చి అడిగాడు. "వాటి ఈజ్ ది మీనింగ్ ఆఫ్ ది వర్డ్ షెల్టర్?"





'ద్వారకా'(సి.హెచ్. వెంకటరత్నం)

నవ్వు ముఖంతో ఆశ్చర్యంగా, అమాయకంగా తాతయ్య కళ్లలోకి చూచింది ప్రియాంక.

"అలా చూస్తావేం దమ్మా...చెప్పవేం?" లాలనగా అడిగాడు.

"అసలు నువ్వేమి అడుగుతున్నావు, తాతయ్యా?"

"మీ పుస్తకంలో మొదటి పాఠం పేరేమి టమ్మా?"

"మొదటి పాఠం ఏంటి, తాతయ్యా, మొదటి పాఠం?"

"అదే నమ్మా...ఫస్ట్ లెస్సన్."

"ఓ....ఫస్ట్ లెస్సనా...షెల్టర్!" అన్నది ఉత్సాహంగా.

"అదే...ఆ షెల్టర్ అనేమాటకు అర్థమేంటి?"

"అర్థమేంది, తాతయ్యా?"

"అదేనమ్మా...మీనింగ్."

"అవన్నీ చెప్పరు, తాతయ్యా, మా స్కూల్లో."

"పాఠం పేరుకే అర్థం చెప్పకుండా మరేం చెబుతా రమ్మా?"

"మెటీరియల్‌లో అది లేదు." మూతి ముడుచుకున్నది ప్రియాంక.

"మెటీరియలా...అదేంటమ్మా?" గుడ్లు మిటకరించడం విష్ణుమూర్తి వంతైంది.

"మెటీరియలంటే మెటీరియలే...మెటీరియ లంటే కూడా తెలీదా? అయితే, నీకేం తెలీదు పో!" దూరంగా పోయి చేతులు తట్టి నవ్వింది ప్రియాంక. 'తాతయ్య కేంతెలీదు' అని కేరింతలు పెడుతున్నది.

వంటింట్లో వంకాయలు తరుగుతున్న వాళ్ల నాయనమ్మ చెవిన పడ్డాయి ప్రియాంక పలుకులు. ఆవిడ అభిమానం దెబ్బతిన్నది. "మీ తాతయ్యకూడా టీచరేనే. ఒట్టి టీచరు కాదు...హెడ్మాస్టరు తెలుసా?" అన్నది దీర్ఘాలు తీస్తూ.

"అవునా, తాతయ్యా, నువ్వు హెడ్మాస్టరువా?" ఆశ్చర్యంగా అడిగింది ప్రియాంక తాతయ్య ఒళ్లోకి చేరి.

"అవునమ్మా...అనుమాన మెందుకు?"

"మరి మెటీరియ లంటే తెలీలేదే నీకు?"

"మా కాలంలో అవన్నీ ఉండేవి కాదమ్మా."

"మరి మెటీరియలే లేకుండా పిల్లల కేం చెప్పేవాళ్లు?"

"అన్నీ చెప్పేవాళ్లం. ఆలోచించడం నేర్పే వాళ్లం. ఇంకా ఏమేమో చేసేవాళ్లంలే. సరేగానీ, ఇంతకూ ఆ మెటీరియలంటే ఏంటమ్మా?"

తాతయ్య ఒడిలోంచి లేచిపోయి తన పుస్తకాల సంచిలోంచి ఒక పొడుగాటి బొండు నోటుబుక్కును తెచ్చి ఆయనముందు పడేసి, "ఇదీ మెటీరియలంటే" అని నవ్వింది.

కుతూహలంగా పుస్తకం చేతిలోకి తీసుకొని పరిశీలనగా చూచాడు విష్ణుమూర్తి. అట్టమీద స్కూలుపేరు ఉంది. వెల ఇరవై రూపాయ లంటూ పెద్ద అంకెల్లో ముద్రించారు. చిరునవ్వుతో పుస్తకం తెరిచాడు. పేజీలు తిప్పాడు. దాదాపు టైపు చేసిన ఫుల్‌స్కేప్ సైజు కాగితాలు వంద ఉన్నాయి అందులో. ఒక్కొక్క సబ్జక్టుకు కొన్ని పేజీలు కేటాయించారు.

మొదట తెలుగు పాఠ్యాంశాల ప్రశ్నలు, జవాబులు ఉన్నాయి. అలాగే హిందీ. ఆ తర్వాత ఇంగ్లీషు, లెక్కలు, సైన్సు, సోషలు... అన్ని సబ్జక్టులకు చెందిన ప్రశ్నలు, జవాబులు ఉన్నాయి.

"మెటీరియలంటే ఇదా, తల్లీ!" అని పగలబడి నవ్వాడు విష్ణుమూర్తి. తరువాత తేరుకొని, "ఏదీ...నీ సంచీ ఇటివ్వు" అన్నాడు.

"సంచీ ఏంది సంచీ?" ముఖం అదోలా పెట్టి అన్నది ప్రియాంక.

"సంచీ అంటే అర్థం కాలేదా. సరేలే. నువ్వు ప్రతిరోజూ స్కూలుకు మొయ్యలేక మోసుకుపోతూ ఉంటేవే....అది" అన్నాడు, మూలగా పడి ఉన్న పుస్తకాల సంచిని వేలితో చూపుతూ.

"ఓ అదా....అది సంచీ కాదు, తాతయ్యా, నా స్కూలు బ్యాగ్."

"ఆఁ...అదే అదే. దాన్నిలా తీసుకురా."

ప్రియాంక స్కూలు బ్యాగును తన బల మంతా ఉపయోగించి తాతయ్య ముందుకు లాక్కొచ్చి పడేసింది. పుస్తకాల ఒత్తిడికి తట్టుకో లేక నాలుగు మూలలా నోరు తెరిచింది సంచి. బ్రహ్మరాక్షసుడి నోట్లోంచి బయటికి కనిపించే పంటికోరల్లా కనిపిస్తున్నాయి పుస్తకాలు. సంచి దగ్గరకు లాక్కున్నాడు విష్ణుమూర్తి.

"అసలే అంత సన్నంగా ఉన్నావు...ఇంత బరువు రోజూ ఎలా మోసుకుపోతున్నా వమ్మా స్కూలుకు?!" అంటూ సంచీలోంచి ఒక్కొక్క పుస్తకమే బయటికి తీశాడు.

ప్రభుత్వ ప్రచురణ...తెలుగు వాచకం. దానికి గైడు. ప్రైవేటు ప్రచురణ సంస్థల ఇంగ్లీషు పుస్తకాలు రెండు. దానికి గైడు. సైన్సు పుస్తకం. దానికి గైడు. సోషలు పుస్తకం...దానికి గైడు. ప్రతి సబ్జక్టుకు బొండు నోటుబుక్కులు. తెలుగు, హిందీ, ఇంగ్లీషు కాపీ రైటింగు పుస్తకాలు. కొన్ని చిత్తు కాగితాలు. ఇద్దరు సినిమా హీరోల ఫొటోలు....ఒకటొకటిగా బయట పడ్డాయి. వాటికి తోడు పెన్ను, పెన్సిలు, మెండరు, చాక్లెట్లు పెట్టుకునేందు కో బాక్సు ఉన్నాయి. ఇరవై చదరపు అడుగుల గదిలో రెండు వందలమంది మనుషుల్ని కుక్కినట్లున్న దా సంచి.

"అబ్బా...ఇన్ని పుస్తకాలా? వీటన్నిటినీ చెబుతా రావమ్మా స్కూల్లో?" ఆశ్చర్యంగా అడిగాడు విష్ణుమూర్తి.

"ఈ మెటీరియల్‌కూడా అందులోదే, తాతయ్యా!" అంటూ ఆ పుస్తకాన్నికూడా వాటితో చేర్చింది.

"మెటీరియల్ ఉన్నప్పుడు ఈ గైడ్లన్నీ ఎందుకమ్మా?" నవ్వాడు విష్ణుమూర్తి.

"మీరు చదువుకునేప్పుడు ఇన్ని పుస్తకాలు లేవా, తాతయ్యా?" అమాయకంగా అడిగింది.

"ఇన్ని పుస్తకా ల్లేవు, తల్లీ! ఇన్ని కొనేందుకు మా నాన్నదగ్గర డబ్బులుకూడా ఉండేది కాదు."

"మీ నాన్న అంటే మీ డాడీనా, తాతయ్యా?"

"అవునమ్మా...అవును."

"ఆయన మాకు డాడీ కాదు. నాన్నే. నాన్నగారు కూడా కాదు." విషాదం ధ్వనించింది ఆయన స్వరంలో.

"అయితే, మీ మమ్మీని ఏమనేవాడివీ?"

"అమ్మ. 'అమ్మా' అని పిలిచేవాడిని. మా అమ్మ చాలా అమాయకురాలు. సినిమాలు, పత్రికలు అంటే తెలీ దామెకు."

"అయితే, మీ మమ్మీ చదువుకోలేదా?"

"మా అమ్మే కాదు. నాన్నకూడా రెండో తరగతిమించి చదువుకోలేదు."

"అంటే సెకండ్ క్లాస్ అన్నమాట."

"అవునవును. అంతే. మీ డాడీ ఎం.ఎ. చదివాడు. మీ మమ్మీనేమో బి.ఎ. చదివింది.



## మీకు తెలుసా?

బాలీవుడ్ హీరోల్లో ఎవరికి జనరల్ నాలెడ్జ్ ఎక్కువగా వుంది? అజయ్ దేవగణ్‌కు.


ఏ హీరో మూడేళ్ల కూతురు సినిమాల్లో చేయాలనుకుంటూంది? అది కూడా షారూఖ్ ఖాన్ సరసన? శ్రీదేవి-బోనీకపూర్ల కూతురు జాహ్నవి.

మరో స్టార్ సన్ వున్నాడు. పదకొండేళ్ల ఆ బాలుడికి క్రికెట్ హీరో కావాలని వుంది. ఎవరతను? జాకీష్రాఫ్ సుపుత్రుడు టైగర్.

ఐదేళ్లున్న షారూఖ్ ఖాన్ కుమారుడు ఆర్యన్ ఏం కావాలనుకుంటున్నాడు? స్పైడర్ మాన్.

ఎన్.





ఇద్దరూ చాలా తెలివి గలవాళ్లు. ఉద్యోగాలు చేసి డబ్బు సంపాదిస్తున్నారు. అందుకే నీకు ఇన్నిన్ని పుస్తకాలు కొనిపెడుతున్నారు. నెలకు మూడ వందలు నీ స్కూలుకు ఫీజు చెల్లిస్తున్నారు."

"అయితే, మీకు బుక్సే ఉండేవి కావా?"

"ఒకటో తరగతికి ఉండేవి కావమ్మా. ఇసుకలో వేలితో రాయించేవాళ్లు మా టీచర్లు."

"ఫస్టు క్లాసులో నన్నమాట. మరి సెకండ్ క్లాసులో....?"

"అప్పుడు పలకా, బలపం. అవి కొనేందుకే కష్టపడ్డాడు మా నాన్న."

"పాపం...పూర్ ఫెలోస్!" చప్పరించింది ప్రియాంక.

సూదితో గుచ్చినట్లైంది విష్ణుమూర్తికి.

మనమరాలితో మాట్లాడుతూ మాట్లాడుతూ పుస్తకా లన్నిటినీ తెరిచి చూచాడు. అచ్చు పుస్తకాలు చాలావరకు చిరిగిపోయాయి. నోటు బుక్కుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ప్రతి నోటుబుక్కులోనూ చీమ తలకాయంత అక్షరాలు. కోడిగీతల్లాగా ఉన్నాయి. పెన్సిలుతో రాసింది. తప్పుపోయిన ట్లనిపించిన చోటనల్లా వేలు తడి చేసుకుని రుద్దినట్లున్నది. పేజీలనిండా మరకలు ముద్దలు ముద్దలుగా.

ఎర్ర సిరా టిక్కుమార్కులు ప్రతి పేజీలోనూ ఉన్నాయి. మార్జిన్‌లో టీచరు సంతకం మెలికలు కూడా ఉన్నాయి.

"సరేగానీ, ఈ ఎర్ర ఇంకు మార్కులన్నీ ఎవరు పెట్టారమ్మా?"

"మా టీచరు, తాతయ్యా. ఏం బాగాలేవా?"

"చాలా బాగున్నయ్యమ్మా. కింద సంతకం కూడా పెట్టిందిగా. చాలా బాగుంది."

"తేదీ అంటే డేట్ కదా, తాతయ్యా?"

"అవునమ్మా. ఇంతకూ ఆ టిక్కుమార్కులు ఎందుకు పెట్టినట్లు?"

"ఎందు కేంది, తాతయ్యా! నేను రాసిందంతా రైటేనని, నన్ను బలే మెచ్చుకుంటుంది మా టీచరు."

"సరేలే పాపం... ఇందులో రైటో, రాంగో నాకు తెలిసి చావడం లేదమ్మా. ఇదిగో...ఇదిగో ఇక్క డేం రాశావో చదువమ్మా. నాకేం తెలీడం లేదు."

"మా టీచరు బాగా చదివింది, తాతయ్యా. అందుకేగా రైట్ మార్కులు పెట్టింది. బాగా రాశానని మెచ్చుకున్నది, తాతయ్యా!"

"మరి నా కొకటే అర్థం కావడం లేదు కదమ్మా. నువ్వే రాశావుగా. చదువు... వింటాను."

"ఇసుక అంటే శాండ్‌కదా...శాండ్‌లో రాశావు కాబట్టి నీ హెడ్‌లో మడ్ చేరింది, తాతయ్యా!" చేతులు తడుతూ అన్నది ప్రియాంక.

## ప్రీతికి బాయ్ ఫ్రెండ్ సలహా!

ఏమని? దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకోమని. గత ఏడాదంతా జనం హృతిక్ మానియాతో కొట్టుకు చచ్చారనీ, ఇప్పుడు అతన్ని తలుచుకునే వారెవరూ లేరనీ, అందువల్ల జాగ్రత్త పడమనీ ప్రీతీజింటాకు, ఆమె బాయ్ ఫ్రెండ్ ఆమీర్‌ఖాన్ ఓ ఉచితసలహా పారేశాట్ట. అసలింతకూ జరిగిందేమిటంటే, ప్రీతి, హృతిక్‌తో రెండు సినిమాలు అంగీకరించింది. వరసనే



సినిమాలన్నీ ఫ్లాపులైపోయి దిక్కు తెలీకుండా వున్నాడు కనుక అతనితో కాకుండా, బాలీవుడ్‌లో టాప్ హీరో అయిపోయిన వివేక్ ఒబెరాయ్‌తో చేతులు కలపమన్నాట్ట. మరి ప్రీతి బాయ్ ఫ్రెండ్ మాట వింటుందో లేదో!

ఎస్.



బట్టతల గీరుకున్నాడు విష్ణుమూర్తి. కళ్లద్దాలు సవరించుకున్నాడు. "నా తల దేముందిలేమ్మా?! మీ టీచరు మెచ్చుకుంది కదా...నేనుకూడా మెచ్చుకుంటాను. చదువమ్మా!" బతిమలాడాడు.

"నీ కసలు చదువురాదు పో...నీ ముందు చదవను." కోపం నటిస్తూ దూరంగా పోయింది ప్రియాంక.

"చాక్లెట్లు కొనిపెడతాగా...చదువమ్మా. అంతా వద్దులే. కొద్దిగా చదువు. మళ్లీ అడగనుగా. ఒక్కసారి చదువు చాలు." మళ్లీ బతిమలాడాడు విష్ణుమూర్తి.

మామగారి మాటలు విన్నది జానకి. ఆయన మీద జాలి కలిగినట్లున్నది....బయటికొచ్చింది. ఆ సమయానికే విష్ణుమూర్తి శ్రీమతికూడా వచ్చిం దక్కడికి.

మనుమరాల్ని దగ్గరకు తీసుకుని ప్రియంగా తల నిమురుతూ, "చదువమ్మా....తాతయ్య నిన్ను మెచ్చుకుంటాడే." చాటంత ముఖం చేసుకుని చెప్పింది నాయనమ్మ.

"చదువురాని ఈ అంకుల్‌ని ఎలా పెళ్లి చేసుకున్నావు, ఆంటీ?" అన్నది ప్రియాంక విష్ణుమూర్తిని చేత్తో చూపుతూ.

తాతయ్య అంకుల్‌గా, నాయనమ్మ ఆంటీగా దిగజారడం బాధాకరమే మరి. విష్ణుమూర్తి కళ్లు నీటితో నిండాయి. "నేను అంకుల్‌ని కాదురా. కనీసం గ్రాండ్‌పా అనొచ్చుకదా. నాయనమ్మను ఆంటీ అనకుండా గ్రాండ్‌మా అనైనా అనొచ్చునుకదా!" గద్గదస్వరంతో అన్నాడు విష్ణుమూర్తి.

మమ్మీ..డాడి...ఆంటీ....అంకుల్‌ను మించి ముందుకు సాగడం లేదు ఇంగ్లీషు చదువులు.

"తాతయ్య చాక్లెట్లు తెచ్చిపెడతా రమ్మా...చదువు. నువ్వు రాసిందేగా. చదువు." బతిమాలింది జానకి.

"ఆయన తెచ్చేదేంది బోడి....డాడీ సాయంత్రం తెస్తానన్నారుగా!" అంటూ వరుగుతీసింది ప్రియాంక.

0000

"నాన్నా! ఓ స్కూల్లో ఇంగ్లీషు టీచరుగా తీసుకుంటా మన్నారు. రేపు జాయిన్ అవమన్నారు." హుషారుగా చెప్పింది శైలజ...విష్ణుమూర్తి కూతురు.

"జీతం ఎంత ఇస్తారుటమ్మా?"

"ఆరొంద లిస్తారట, నాన్నా!"

"బిఏస్సీ చదివావు...ఆరొంద లేమిటమ్మా!"

"ఇంట్లో గోళ్లు గిల్లుకుంటూ కూచుంటే ఏం లాభం, నాన్నా, చదువుకున్నందుకు ప్రయోజనం ఉండాలిగా. డబ్బుకోసం కాక అనుభవం సంపా

దించుకునేందుకు అక్కడ చేరుదా మనుకుంటున్నాను." ఉత్సాహంగా అన్నది శైలజ.

"సరేనమ్మా....నీ ఆలోచనా సమంజసంగానే ఉంది. అలాగే చెయ్యి."

ఉద్యోగంలో చేరిన మూడవ రోజున తండ్రి దగ్గరి కొచ్చింది శైలజ. ఆవిడ చేతిలో రెండు పుస్తకా లున్నాయి. "సిక్స్త్, సెవెంత్ ఇంగ్లీషు టెక్స్ట్ బుక్స్, నాన్నా! ఆ క్లాసులకు ఇంగ్లీషు చెప్పమన్నారు నన్ను. నా కసలు అనుభవం లేదుగదా, నాన్నా! ఈ పాఠాలు ఎలా చెబితే బాగుంటుందో నాకు చెప్పండి. అలా చెప్పేందుకు ప్రయత్నిస్తాను." పుస్తకాలు తండ్రి చేతిలో పెట్టి ఎదురుగా కూచుంది.

ఒక పుస్తకం తెరిచి మొదటి పాఠం చదివాడు విష్ణుమూర్తి. ఆ పాఠం ఎలా చెబితే బాగుంటుందో వివరంగా చెప్పాడు. "ఇప్పుడు చెప్పమ్మా...ఎలా చెబుతావో వింటాను."



శైలజ జాగ్రత్తగా తండ్రి చెప్పింది జ్ఞాపకం తెచ్చుకుంటూ చెప్పింది. అంత సంతృప్తికరంగా లేకపోయినా, ప్రోత్సహించేందుకు మెచ్చుకున్నాడు. సంతోషించింది శైలజ.

విష్ణుమూర్తికి మంచిటీచరుగా జిల్లాలో పేరుంది. ఆయన సంతానాని కది గర్వకారణమే.

రెండవ రోజు సాయంత్రం ఉల్లాసంగా తండ్రి దగ్గర కొచ్చింది శైలజ. "పిల్లలు నా పాఠం విని బలే మెచ్చుకున్నారు, నాన్నా. ఇంకా రెండు మూడు పాఠాలు చెప్పండి. మీలాగే మంచి టీచరుగా పేరు తెచ్చుకుంటాను" అనడిగింది.

కూతురు తల నిమురుతూ సంతోషించాడు ఆయన. "పట్టుదల ఉంటే నాకంటే మంచి టీచరు వవుతావమ్మా" అంటూ ఆశీర్వదించాడు.

పదిరోజులు గడిచాయి. శైలజ తిరిగి తండ్రిదగ్గరకు రాలేదు. ఒక రోజు కూతుర్ని దగ్గరకు పిలిచాడు.

"ఏమ్మా....మళ్లీ ఏ పాఠమూ చెప్పమని అడగలేదేం?" అడిగాడు.

"మానేజ్‌మెంటువాళ్లు పాఠాలు అలా చెప్పొద్దన్నారు, నాన్నా! అంత వివరంగా చెప్పాల్సిన అవసరం లేదట. పాఠం టూకీగా చెబితే చాలట. ప్రశ్నలు...జవాబులు వాళ్లిచ్చిన మెటీరియల్‌లోవి చదివిస్తే చాలునట. వాటినే బాగా కంఠస్థం చేయించాలిట...మా పని చాలా తేలికైంది." నవ్వింది శైలజ.

"ఏం చదువుతున్నారో పిల్లలు అర్థం చేసుకో నవసరం లేదు. టీచర్లు ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో ఆలోచించాల్సిన అవసరం లేదు. ఈ అర్థం పర్థం లేని చదువు లెందుకమ్మా?! అర్థంకాని చదువు వ్యర్థం అన్నారు పెద్దలు. అంతా చిలక చదువైపోయింది. నేర్పితే చిలకకూడా మాట్లాడుతుంది. కాని, ఏం మాట్లాడుతున్నదో దానికి తెలీదు. అలవాటు ప్రకారం నేర్పిన మాటలు మాట్లాడుతుంది. అలవాటుతో బతికేది జంతువులు; ఆలోచనతో బతకాల్సింది మనుషులు. స్కూళ్లు ద్విపాద జంతువుల్ని చతుష్పాదులుగా మార్చేందుకు తంటాలు పడుతున్నాయి." నిట్టూర్చాడు విష్ణుమూర్తి.

"పేరెంట్సు మార్కులు కావాలని గోల చేస్తారట, నాన్నా! వాళ్ల పిల్లలు ఎప్పుడూ ఫస్ట్ గ్రేడులోనే ఉండాలని పోట్లాడుతారుట. అందుకని పిల్లలకు మార్కులొచ్చేలా చెయ్యాలి. లేకపోతే వాళ్ల పిల్లల్ని వేరే స్కూల్లో చేర్పిస్తారేమోనని వాళ్ల భయం. డబ్బు కోసమేగా వాళ్లు స్కూలు పెట్టింది" అన్నది శైలజ.

"ఏం స్కూళ్లో, ఏం పేరెంట్సో, ఏం చదువులోనమ్మా....మా కాలంలో ఇలాంటి పరిస్థితు ల్లేవు. విద్యకు కేంద్రంగా ఉపాధ్యాయుడు ఉండేవాడు. ఇప్పుడు టీచరు పొగడ్త లందుకుంటూ నిర్జీవంగా, ఒక కాగితపు బొమ్మలాగా ఉన్నాడు. విద్య వ్యాపారవస్తువుగా మారిపోయింది. తిరుపతి దేవుడినే వ్యాపారవస్తువుగా మార్చేశారు." ఎంతో ఆవేదనతో అన్నాడు విష్ణుమూర్తి.

"రోజులు మారాయి, నాన్నా! పరిస్థితులూ మారాయి. విలువలు మారాయి." అంది శైలజ.

"మారనిదల్లా కొత్త పరిస్థితులకు పాత విలువల్ని జోడించడమేనమ్మా! ఇదికూడా మారాలి. కొత్త పరిస్థితులకు కాలానుగుణమైన విలువలు జోడించాలి. 'గురుర్ బ్రహ్మ, గురుర్ విష్ణు, గురుర్ దేవో మహేశ్వర, గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మైః శ్రీ గురవే నమః' లాంటి శ్లోకాలకు కాలం చెల్లిపోయింది. గురు దేవోభవ, ఆచార్య దేవో భవ లాంటి ఊకదంపుడు పదాలను వల్లించడం మానుకోవాలి. వీటి చోట్లో కొత్తశ్లోకాలు, నానుడులు ఉద్భవించాలి. అప్పుడుకాని, రావాల్సిన మార్పు పూర్తిగా రాదు.



"టీచర్ల తలలు కరిమింగిన వెలగపండ్లు అవుతున్నాయి. మార్కులమూటలు ఖాళీ తలలమీద పెట్టుకొని సమాజంమీద ముసురుకుంటున్నారు విద్యార్థులు ఉద్యోగార్థులై....

"వాళ్లిచ్చిన మెటీరియల్ చదివించేందుకు డిగ్రీ హోల్డ ర్లెందుకమ్మా! ఏ పదో తరగతి ఫెయిలైనవాడైనా ఆ పని చెయ్యగలడు. రేపటినుండి ను వ్వా స్కూలుకు పోవద్దు. నీకు కొస్తంతైనా ఆలోచనాశక్తి మిగిలి ఉంటుంది. వెధవ ఆరొందల రూపాయలకు నీ ఆలోచనాశక్తిని, ఆసక్తిని అమ్ముకుని జడపదార్థంలా తయారుకావద్దు. డోంట్ సెల్ అవే యువర్ థాట్‌ఫుల్‌నెస్ ఎట్ ఎనీ కాస్ట్..." ఆవేశంగా, బాధగా అన్నాడు విష్ణుమూర్తి; తిరుమల శ్రీనివాసాచార్య రుబాయి--

'మార్పు మంచిదే కాని...శిల్పం శిల
కాకూడదు
మార్పు గొప్పదేకాని....పువ్వు మొగ్గ
కాకూడదు
మార్పు తప్పదెప్పుడైనాకాని....చెయ్యి చెంచా
కాకూడదు' గుర్తొచ్చి. ■

**బిగ్ బీ బిజీ బిజీ!**

ఇటీవల ముంబయిలో జరిగిన ఒక సమావేశంలో బిగ్ బీ అమితాభ్ బచ్చన్ చెప్పిన కబురిది. "హీరోగా గొప్ప దశలో వున్నప్పుడు, అంటే డెబ్బయ్యో దశకంలో కూడా నేనింత బిజీగా లేను. ఇవాళ పది చిత్రాల్లో చేస్తూ విపరీతమైన బిజీగా వున్నాను. అదీ కాక కెనడాకు చెందిన ఓ చిత్రనిర్మాత 'ది ఫిఫ్త్ మూవ్' చిత్రంలో చేసేందుకు అవకాశం ఇచ్చారు" అన్నాడు బిగ్ బీ. ఈ చిత్రానికి బాలీవుడ్ దర్శకుడైన విధూవినోద్‌చోప్రా దర్శకత్వం వహిస్తున్నాడు. చిత్రంలో హాలీవుడ్‌లో పేరు పొందిన నటులు పాల్ న్యూమాన్, రాబిన్ విలియమ్స్ డస్టిన్ హాఫ్‌మాన్ వంటి వారే కాకుండా, బాలీవుడ్‌కు చెందిన ఓ సుప్రసిద్ధనటిని హీరోయిన్‌గా తీసుకుంటున్నారట!

ఎన్.